# 'భువనచంద్రుడ'నే పేరు సార్థకం చేసుకుంటున్నవాడు!

## - మద్రాసు భువిలోనే ఉన్న దీర్ఘదర్శి, మంచికి మార్గదర్శి!! -

ఆ బుగ్గమీసాలు, ఆ మీసాల మధ్య దోగాడు నవ్వు. ఆ కళ్ళనందు తేజస్సు, భృగిట మధ్య అనూహ్యమైన విశ్వాసం. చంద్రునివలె అందరి మోములపై తన తరగని చిరునగవునే ప్రతిబింబించేట్టు చేయడంలో తనకుతానే సాటియనిపించుకునే భువనచంద్రుని చూడ్కులు నన్నెంతగానో స్పందింపచేసాయ్.



నాకూ ఆయనకూ ఒక పోలిక చక్కగా కుదిరినట్టు ద్యోతకమైంది. జరగబోయేది ముందుగానే మస్తిష్కంలో నిక్షిప్తం కావడం - ఈ వ్యాసంలోని విషయాలకు సమానంతరేఖల్లా పయనించాయ్.

ఉదాహరణకు ఓ రెండు, మూడిటనే విపులీకరిస్తాను. నాకప్పుడు అయిదేళ్ళ వయసు కన్నా ఉండదు. నేను 'గురి' చెబుతానని మా అన్నయ్య 'మన ఆస్తి మనకు దక్కుతుందా, పోనీ వారసత్వపు సంపదయైన వస్తుందా' - అని అడిగాడు.

'రాదు' అని రెండు అక్షరాల్లో చెప్పేసరికి ఛడాల్న మొల బెల్టు తీసి రెండేసాడు.

పదేళ్ళ వయసులోనే మా అమ్మ పోయేసరికి - మా పినతల్లులూ, మేనమామ, మేనత్త దగ్గరకెక్కువగా వెళ్ళేవాణ్ణి. వాళ్ళేమైనా దేవునికి మీదు కట్టాలనేసరికి నా చేతులద్వారా కట్టించేవారు.

ఒకసారి అదే ప్రాయంలో మా తాతగారు గోటేటి సుబ్బారాయుడు గారు కట్టించిన శివాలయ మేనేజిమెంటు మా అన్నయ్య చేద్దామనేసరికి - 'పెద్దనాన్న పెత్తనం చేసి వంశాంకురం లేకుండాపోయాడు - నీవు ఆ ప్రమాదాన్ని కొనితెచ్చుకోకు' అన్నాను. అలాగే పాలకొల్లు రైలుస్టేషనున్న

(తరువాయి 17వ పేజీలో)


# ఇంగ్లీషు కాదు... ఎంగిలిపీసు అంటారు భువనచంద్ర

## అమ్మ ఒడినుంచే మాతృభాష నేర్చుకోవాలి. 10వ తరగతి వరకు తెలుగులో అభ్యాసం కావాలి.

జరగబోయే విషయాన్ని అంతరాత్మ కలల రూపంలో చెబుతుంది అంటారు ఆయన. భువనచంద్రకు తన అంతరాత్మ చెప్పిన నిజమేమిటో కొన్ని విందాం...

భువనచంద్ర శ్రీకాకుళంలో చదివే రోజుల్లో జరిగిన సంఘటన :

నాన్నగారికి ఒంట్లో బాగోలేదని వైజాగ్ కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఒకరోజు రాత్రి ఏడుగంటల సమయంలో వాళ్ళ వదినగారు భోజనం పెట్టారు. ఆయనకు తినబుద్ధి కాలేదు. అన్నంలో ఒక్క మెతుకైనా వృథా చేయకూడదనేది ఆయన ఫిలాసఫీ. ఈ ఫిలాసఫీ నాకూ ఉండేది. నా చిన్నప్పుడు మా అమ్మగారు - భోజనం చేస్తూ, ఎన్ని మెతుకులు పారేస్తావో అన్ని లంకణాలు చేస్తావనేది. నాకు జ్వరం వచ్చి ఎన్ని లంకణాలు చేయాలనో భయం వేసేది.



ఎందుకంటే సృష్టించే శక్తి లేనప్పుడు ధ్వంసం చేసే హక్కుగానీ, వృథాచేసే హక్కుగానీ మనకు లేదు. అలాంటిది ఇలా చేయి పెట్టి అలా భోజనాన్ని వదిలేసి చేయి కడుక్కున్నారాయన.

"ఏం జరిగింది." అంటూ వదినగారు ఆశ్చర్య పోయారు.

"మనసు బాలేదు" అన్నారాయన.

"మనసు బాలేదు" అనే మాటను ఆయన జీవితంలో మొట్టమొదటిసారిగా ఉపయోగించిన సందర్భం అది.

పక్కమీద అటు దొర్లుతు, ఇటు దొర్లుతున్నారు. రాత్రంతా నిద్రలేదు. తెల్లవారుఝామున ఏ నాలిగింటికో మెల్లగా నిద్రపట్టింది.

సరిగ్గా అప్పుడే హాస్పిటల్ నుంచి ఆయన అన్నయ్య వచ్చాడు. వదిన మేల్కొనే వుంది. నన్ను నిద్రలేపడానికి ప్రయత్నిస్తూ... "నే... నాన్న పరిస్థితి బాలేదురా" అన్నాడు. సెమీ కాన్షియస్‌లో ఉన్న భువనచంద్ర 'నాన్న ఎప్పుడో చనిపోయాడు కదా" అన్నారు. అన్నావదినలిద్దరూ షాక్ అయ్యారు. మరుసటిరోజు నేను చెప్పిందే జరిగింది!

× × ×

హర్యానాలోని సిరసలో ఇండియన్ ఎయిర్‌ఫోర్సులో పనిచేస్తున్నప్పుడు జరిగిన ఓ సంఘటన...

"నాకు కూతురు పుట్టింది" అని ఒక ఫ్రెండ్ చాలా సంతోషంగా చెప్పాడు. ఢిల్లీకి వెళ్ళి కూతుర్ని చూసుకొని వస్తాను అని అన్నాడు.

"రేపు వెళ్ళవచ్చుగా" అన్నాం మిత్రులందరము.

ఇలా వెళ్ళి అలా వచ్చేస్తాను అన్నాడు. ఇలా వెళ్ళినవాడు అలా రానే లేదు. మూడు రోజులు గడిచాయి. తేలిన విషయం ఏమంటే...

ఢిల్లీలోని ఒక హాస్పిటల్‌లో బిడ్డను చూసి మురిసిపోయిన నా స్నేహితుడు సిగరెట్ తాగడానికి బయటకు వచ్చాడట. రోడ్డు దాటబోతుండగా, ఏదో వెహికల్ కొట్టేసిపోయింది. అంతే, అక్కడికక్కడే అతను చనిపోయాడు. అదే హాస్పిటల్‌లో అతణ్ణి మార్చురీలో గుర్తుతెలియని శవంగా ఉంచారు. ఈ విషయం రెండు రోజుల వరకు పాపం, ఆయన భార్యకు కూడా తెలియదు. ఈ విషయం తెలిసిన రోజు నాటి రాత్రి నాకు నిద్రయే పట్టలేదు.

విధి మనిషి ఉనికి కర్మ

జన్మ, పునర్జన్మ, ఆత్మ, అంతరాత్మ... ఇలా రకరకాల తాత్త్విక విషయాలతో ఆ రాత్రి నా మనసు ఆలోచనలతో నిండిపోయింది. ఇది శ్మశాన వైరాగ్యం మాత్రం కాదు. నాలోకి నేనుగా, వాస్తవంలోకి నేనుగా ప్రస్థానం చేసిన నిద్రలేని రాత్రి అది అంటూ చెప్పారు భువనచంద్రుడు.

× × ×

ఒకరోజు స్నేహితులను రిసీవ్ చేసుకోవడానికి రైల్వేస్టేషన్‌కు భువనచంద్ర వెళుతుంటే ఇరవై సంవత్సరాలు తన కలలో దర్శనమిచ్చిన స్త్రీ కనిపించిందట! తమది తల్లీబిడ్డల అనుబంధం అని చెబుతున్నారు ఆయన. ఈ విషయాన్ని మనం నమ్మవచ్చు, నమ్మకపోనూ వచ్చు. అది మన స్వేచ్ఛ. భువనచంద్ర కోరుకునే స్వేచ్ఛ భిన్నమైనది. అతనికి కీర్తినీడ తాకని అసలు సిసలు స్వేచ్ఛ కావాలి. మాయమర్మం లేని మంచి మాటలు కావాలి. అప్పుడు తాను జనం మెచ్చే పాటలు ఎన్నయినా రాస్తారు. రాయకలుగుతారు. 'చంద్రముఖి' తమిళ చిత్రంలో 'రారా చెంతకు రారా' అన్న తెలుగు పాట సూపర్ డూపర్ హిట్టు. ఎంతోమంది తమిళ ప్రేక్షకుల నోళ్ళలో ధ్వనిస్తూనే ఉన్నది. అదీ భువనచంద్రుని ప్రత్యేకత.

(16వ పేజీ తరువాయి)

మన ఆస్తి రైల్వే పాలయింది. కోర్టులో కేసు వేద్దామా అన్నాడు – అలాగే లజపతిరాయపేటలోని ఓ యింటి స్థలం కోసం కోర్టుకు వెళ్ళి – ప్లీడర్లు, కోర్టు ఖర్చుల కోసం ఉన్న యింటి స్థలాన్ని అమ్మేసాడు. ఆ విషయాన్ని ముందుగానే చెబితే నాపై విరుచుకుని పడ్డాడు.

నేను కెనడా వెళ్ళినప్పుడు మా బంధువుల కోడలికి పిల్లలు పుట్టరన్నారు. నాకెందుకో ఆ మాట సరికాదనిపించింది. చూడండి – ఓ సంవత్సరంలో మగపిల్లవాడు పుడతాడని చెప్పాను. అలాగే పుట్టాడు. ఆ బిడ్డడికి పాలంటే ఎలెర్జీ, త్రాగడు. ఒక్క ఆరునెలల్లో వాడు పాలు ఇష్టపడతాడు' అన్నాను. అలాగే జరిగింది.

ఇప్పుడు ప్రత్యక్షంగా ఉండే ఓ 90 ఏండ్ల చెట్టియార్ ఆర్.ఆర్. నాథం గారికి 20 సంవత్సరాల క్రితం సెలిబ్రిల్ సంబంధ వ్యాధి వచ్చి, మాట, కాలు పడిపోయింది. నాకు 40 సంవత్సరాలుగా హితుడూ, స్నేహితుడూ! నేను చూడడానికి వెళ్ళాను. రక్కున సాయినాధుణ్ణి తలుచుకుని కలవరపడవద్దు, మీకు మాటా, పూర్వపు తెలివితేటలూ వస్తాయ్. మీరు షిర్డీలో సాయినాధుని క్షేత్రంలో పెద్ద వసతిగృహం కట్టించే తలంపు కలిగియున్నారు. ఆయనే మీకు మాటా, మేధస్సూ యిస్తాడు, మీచే ఆ పనులు చేయించుకుంటాడు. కాలు, చేతులు రాకపోయినా దర్పంతో కూడిన జీవితాన్ని కొనసాగిస్తారు అన్నాను. షిర్డీలో ఆయన 100, 150 గదుల వసతి గృహం కట్టించడమే గాకుండా, భక్తులకు రెండుపూటలా ఆంధ్ర భోజనం ఉచితంగా పెడుతున్నారు. ఆ స్థలాన్ని చూచి రమ్మంటే నేను షిర్డీ వెళ్ళి చూచి వచ్చాను. ఆ సత్రం శంకుస్థాపనంలో విశ్వయోగి విశ్వంజీ పాల్గొన్నారు. వారిచే ఆ వైశ్య శిఖామణి నాకు సత్కారం కూడా చేసారు. షిర్డీ క్షేత్రంలోని విశ్వయోగిని తొలిగా దర్శించుకుని సత్కారం అందుకున్నాను. అది సాయినాధుని కరుణ. గత సంచికలోని విశ్వయోగి వ్యాసంలోనే ఆ ఫోటో ప్రచురించాను.

పరిశుద్ధమైన మనసూ, అందరి మేలూ కోరే మనఃస్తత్వం, చీటికీ మాటికీ అబద్ధాలాడకుండడం, ప్రియ భాషణ, కొద్దో గొప్పో త్యాగబుద్ధి కలవారికి అలాటి స(త్య)ద్వోవాక్కు వస్తుంది.

భువనచంద్రలో ఈ లక్షణాలన్నీ ఉన్నాయ్ కనుకనే, దేశ రక్షణ కోసం భారత సైన్యంలో పనిచేసి, తిరిగి సాహితీ రంగంలో కృషి చేస్తూ, సినీ పాటల రచయితగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానం కల్పించుకుని, పోటీ రంగంలో ఈ బుగ్గమీసాల 'భువనచంద్రుడు' నిలబడకలిగాడంటే మృదుహాసం, ప్రియభాషణం, భేషజం లేకపోవడమేనని నేను భావిస్తున్నాను. తెలుగు సభలెక్కడ జరిగిననూ ఆయన తప్పక పాల్గొంటాడు. విశ్వనాధ వారు తెలుగు పలుకు విషయంగా మాట్లాడుతూ ఒక్క సంగీతమేదో వింటున్నట్లుంటుంది తెలుగు భాషణం అన్నారు. బహుశః భువనచంద్రుణ్ణి ఊహించే ఆ మాట అన్నారేమో! నా ఆయుష్షులో కొంత ఆయుష్షయినా ఈ భువనచంద్రునికివ్వాలని కలం ఉవ్విళ్ళూరుతున్నది. ●

# ఎల్వీ.సుబ్రహ్మణ్యం మానవీయతను గౌరవించేవాడు!

## - సేవాపరంగానే భాగవతత్వాన్ని విశదీకరిస్తాడు!! -



ఎల్వీ సుబ్రహ్మణ్యం

శ్రీకృష్ణదేవరాయల తిరుమల యాత్ర పంచ శతాబ్ద్యుత్సవాలను పురస్కరించుకుని అధ్యక్షోపన్యాసాన్నిస్తూ 'రాయల వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. నేను ఆయన మాటలతో ఏకీభవిస్తున్నాను. తెలుగు అక్షరాలకు కస్తూరీ పచ్చ కర్పూరములు దిద్దిన సాహితీ సమరాంగణా చక్రవర్తి ఆయనే! సాహిత్యాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవాడు కాబట్టే తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి విధులకు చిత్తమును సమర్పించి, నొప్పించక తానొవ్వక అన్న సుపథ మార్గంలో నడుచుకుంటూన్న సౌజన్యమూర్తి ఎల్వీ సుబ్రహ్మణ్యం. అన్నారావు తరువాత అంతటి అంకిత భావముతోనే కోనేటి రాయని సేవ లొనరుస్తున్న అధికారి. (అధికారి అంటే నా అర్థంలో అధికంగా అంతరంగమును నిలిపి సేవ చేస్తున్నవాడని నా భావన. తిరుమల తిరుపతి దేవస్థానం పదవి పదునైన కత్తిమీద నడవడం వంటిది. మంచి పనులు చేస్తే, ఆ క్షణమే మెచ్చుకుంటారు. పొరపాట్లు (అనుమానం) జరిగితే అగాధంలోకి నెట్టేస్తారు.

రాష్ట్రీయ సాంస్కృతిక విద్యాపీఠంలో టి.టి.డి. అన్నమాచార్య ప్రాజెక్టు, రాజకైంకర్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల తిరుమల యాత్రా పంచశతాబ్ది ఉత్సవాలను మూడురోజుల పాటు జాతీయ సదస్సు జరిపారు. ఆయన ఉపన్యాస ప్రారంభంలోనే వజ్ర కిరీటంలోని రత్నాల్లా – విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయల మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకుంటూ ఉన్నత శిఖరాలందుకోవాలన్నారు. వారందరూ శ్రీకృష్ణదేవరాయలు తెలుగు అభిమానంతో రచించిన 'ఆముక్తమాల్యద'లోని పద్యాలన్నిటినీ అధ్యయనం చేయాలన్నారు. అలా ఉజ్వల భవిష్యత్తు నొందవచ్చునీ గుర్తించమంటూ శ్రీకృష్ణదేవ రాయల మనఃస్తత్వాన్ని ముచ్చటైన మూడు ముక్కల్లో చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానముల అదృష్టం కొద్దీ ఎల్వీ సుబ్రహ్మణ్యం కార్యనిర్వాహణాధికారిగా రావడం జరిగింది.

అవధాన చక్రవర్తి మేడసాని మోహన్ మాట్లాడుతూ, 'తెలుగు భాష మాధుర్యం, సౌందర్యాన్ని ప్రపంచానికి చూపించినవాడు శ్రీకృష్ణదేవరాయలు సాహిత్యాన్నే గాకుండా, లలితకళలు, శిల్పకళలు, ఆయన పోషించినట్లు, ప్రోత్సహించినట్టు అన్యులు, ప్రోత్సహించలేదన్నారు. టి.టి.డి. జె.యి.వో. వెంకటరామిరెడ్డి, అనేకమంది పండితులు ఈ సభలో పాల్గొన్నారు. ●

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

*If you want Comfortable Stay - Stay at*
badam group
**BADAM BALAKRISHNA HOTEL**
6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# ఐ.సర్వ్ - శాస్త్రయుత పరిశోధనలకు పంచె కట్టిన వేద పరిశోధకుడూ, చోదకుడూ కుప్పా వేంకట కృష్ణమూర్తి



శబ్దబ్రహ్మ అమ్మ, శాస్త్రబోధ అమ్మ, సత్యరూప అమ్మ, సత్యసాధన అమ్మ, వేదరాశి అమ్మ, పేదరాశి పెద్దమ్మ అమ్మ. ఇందరు అమ్మలను కన్న ఒకే అమ్మ వేదమాత అమ్మ వేదమ్మ. ఆమెను గాయత్రి అనండి, సావిత్రి అనండి, లక్ష్మి అనండి, సరస్వతి అనండి, పార్వతి అనండి - ఎవ్వరైనా ఆ చతుర్వేదాల నుంచీ ఈ చరాచర జగత్తుకు వచ్చి వేద, శాస్త్రాన్ని ఉపనిషత్ సారాన్ని, సర్వవిజ్ఞాన సర్వస్వముగా ఒక్క భారతదేశానికే అందించి భారతదేశాన్ని ప్రపంచ దేశాలకు గురుస్థాన దేశంగా మహర్షులు తీర్చిదిద్దారు. మనవాళ్ళు బండికి గుర్రానికి కట్టి గంతలు గట్టి కాలం పొడుగునా పరుగెత్తించారే తక్క, 'కన్నులకు నిన్నాళ్ళు గట్టిన గంత విప్పితి నింక తిన్నని బాట వేసితిని' అని గరిమెళ్ళ సత్యనారాయణ గారు చెప్పినట్టు, వేదాలలో ఉన్న విశేష సారాంశాలన్నిటినీ విజ్ఞానపరంగా వాటిని శోధిస్తూ, పలువురు విద్యావంతులను సమావేశపరిచి, మన వేదాలే సర్వశాస్త్రాలకు మార్గదర్శనమయ్యాయని తెలిపినవారులేరు. తెలియచేస్తున్న అవిశ్రాంత పరిశోధనా కర్త కుప్పా వెంకట కృష్ణమూర్తి గారని చెప్పడానికి గర్విస్తున్నాను. ఐ.సర్వ్ అంటూ వేదసార పరిశోధకునిగా ముందుకు దూసుకునిపోతున్న సంస్కృతాంధ్రాంగ్ల పండితుడు. వినయశీలి.

భూకంపాలూ, సముద్ర పొంగులూ, తుఫానులూ - ఏ యంత్ర తంత్ర సహాయము లేకుండా పూర్వ పెద్దల్లో నిరక్షరాస్యులుగా ఉండే గ్రామీణులు కూడా కనిపెట్టి చెప్పేవారని నేను 'నల్ల విరచితమైన పాత ఖురం పరిమళం'లో వ్రాసాను.

ఓ రాజు గారు జనాభా పెరిగిపోతుందని 60, 70 వయసుపై కల వృద్ధులందర్నీ చంపేయమన్నాడు. పాపం, ఆ వృద్ధుని కొడుకు పితృపాశం వదలలేక, వృద్ధుడూ, వృద్ధుడూ, గుడ్డివాడైన తండ్రిని భుజాలపై ఎక్కించుకొని, సాగరతీరంగా మోసుకొనిపోతున్నాడు. ఆ వృద్ధుడక్కడి వాతావరణం, సముద్ర అలల తాకిడీ విని ఏలా ఉంది ప్రకృతియని అడిగాడు. వాడు విషయమును చెప్పాడు. ఓరయ్యా, అబ్బాయా - పెను తుఫాను ప్రమాదం వచ్చి ఈ రాజ్య తీరమంతా సముద్రంలో కలిసిపోతుందనీ, పెను భూకంపం వచ్చినా రాగలదనీ, ముందు ప్రభువులకు చెప్పిరారయ్యా! ప్రభువులు చల్లంగా ఉంటే రాజ్యాన్ని చల్లంగా పాలిస్తారు. ప్రజలు చల్లంగా ఉంటే ప్రభువులకు సమ్మదం కలుగు - నన్నిక్కడనే ఎళ్లిరా అయ్యా అని ప్రాధేయపడ్డాడు.

ఎందుకురా అయ్యా నీవంటి పెద్దోళ్ళను బ్రతికుండగానే చంపేయమన్నాడు. అటువంటి ప్రభువుకు మనమెందుకు సహాయం చెయ్యాలి. అక్కర్లేదు అన్నాడు. అట్లా కాదురా - వెళ్లి చెప్పిరా - నీ కాళ్ళు పట్టుకుంటాను. ప్రభువులు బాగుంటే ప్రజలు సైత బాగుంటారు. వెళ్లిరా! అన్నాడు. తప్పేది లేదని ఆ కుర్రాడు ప్రభువులకు చెబితే - నీకెలా తెలుసు అనగా వృద్ధ తండ్రి చెప్పాడనీ, ఊరవతల ఉన్నాడని చెప్పగానే-రాజు పశ్చాత్తాపపడి, మునలాయన్ని మోసుకుని రమ్మని భటులను పంపి, ఆ మునల్ని రప్పించి, ఆ పరిజ్ఞానం తెలుసుకున్నాడు. ఇకమీదట వృద్ధుల జోలికి పోవద్దనీ, సకలోపచారములు చేయమనీ సలహా యిస్తూ, తన ఆజ్ఞనుపసంహరించుకున్నాడు.

అంటే వేదపరమైన మన విజ్ఞానం ఆరోజుల్లో నిరక్షరాస్యుల్లో కూడా జీర్ణించుకుని పోయింది. కుప్పా వారు మాట్లాడుతూ మన వేదాలలో ఇలాటి విజ్ఞాన విషయాలున్నాయనీ, ఇప్పటికీ అడవుల్లో ఉన్న గిరిజనులకున్న విజ్ఞానం, నాగరిక లోకంలో లేకపోవడం కూడా వేదవిజ్ఞాన పరిశోధనకు ప్రధాన కారణమన్నారు. అలాటి విజ్ఞానికీ, వినయ సంపన్నునికీ మా వందనం

తమలపాకు మొక్కగా ఉన్నప్పుడు తాంబూలంగా స్థాయిని పెంచుకుంటానని ఎరుగదంటారు. అలాగే వేదాల్ను భగవంతుడు మానవుని భవిష్యద్దర్శనానికి మార్గగామిగా చేసాడని ఏ పండితుడూ ఇతఃపూర్వం గ్రహించి, శోధించి, శాస్త్రప్రమాణంగా బుజూపరచలేదని నా మిడి మిడి జ్ఞానం చెబుతూంది.


కుప్పా వారిని రెండు దశాబ్దాలకు ముందు గణపతి సచ్చిదానందస్వామి వారి ఆశ్రమంలో చూసాను. అప్పుడు వారు స్వామివారి 'భక్తిమాల' సంపాదకులుగా ఉన్నారు. ఇప్పటికీ 'భక్తిమాల' సంపాదకులు వారే! ఇప్పుడు ఆయన 'ఐ.సర్వ్' అనే సంస్థ బాధ్యతల్ను శిరమునదాల్చారు. సామాన్య బరువు బాధ్యతలు కల 'ఐ.సర్వ్' కాదు, 'సర్వ్' అనేకన్నా 'సర్వే' అంటే సముచితంగా ఉంటుందేమో! వేయి తలలు గల ఆదిశేషుడు మోయవలసిన భారం ఇది. ఇవి గాకుండా యోగ, యాగ, హోత్ర, ఐతిహాసిక గ్రంథ రచనలు చేస్తున్నారు. ఆంధ్రభూమి, పత్రికలో పాఠకుల సందేహాలు తీరుస్తున్నారు. బుల్లితెర వారేయన్ను 'బల్లి'గా పట్టుకుని పుంఖానుపుంఖముగా దివ్యోపన్యాసాలిప్పిస్తున్నారు. వీరి దృశ్య శ్రవణం ద్వారా, 'జెమిని భారతం' నన్నెంతగానో ఆకర్షించింది. అమెరికాలో ఉన్నప్పుడు విడువకుండా చూసేవాణ్ణి. పూర్వ పరిచయం లేకుండానే వారిని దర్శించినపుడు ఎంతో ఆత్మీయంగా, ఆదరంగా, అతి వాత్సల్యంగా పలకరించడం నన్నెంతో పులకరింప చేసింది. ఆయన గర్వగరిమ లేని సహృదయశీలుడని గ్రహించాను. ఆ సమా వేశం రెప్పపాటు సమయంతోనే ముగిసినా, మనః ఫలకంపై శాశ్వతంగా నిలిచి పోయింది.

నా దృష్టిలో తెలుగు అక్షరం వేదాల్నుంచీ గ్రహించబడిన బీజం. **అక్షరం వెలుగు. అక్షరం జ్ఞానం. అక్షరం ప్రేమ. అక్షరం అజరామరం. అక్షరం అజేయం. అక్షరం తత్వం. అక్షరం సమాజ హితైషికారి. అక్షరం వికాసం. అక్షరం అమృతం.** ఇన్నిటినీ **'కు.వేం.కృ'** గారు ఉపాసనం చేసారు. ఉద్వేగం కాని ఉత్సుకత వారి స్వంతం. భూమ్యాకాశ చరిత్రను సర్వే చేస్తూ, ఐ.సర్వ్ అంటున్న వారి హృదయ క్షేత్రంలో 'ఐ'గా ప్రవేశించి 'వుయ్' అనే సమ్యకృత ప్రేమను సంపాదించాను. గురువరేణ్యులు గణపతి సచ్చిదానందుల ఆనంద ప్రసాదం వారికెంతో ఉన్నది, **'కు.వేం.కృ'**లోని హృదయ క్షేత్రమున 'నేను'న్నాను కాబట్టి గణపతి సచ్చిదానంద గురుపాదుల ఆహ్లాద ప్రసాదంలో 'ప్రహ్లాదం' నాకూ ఉన్నది. **'ఐ.సర్వ్'** ఉజ్వల భవిష్యత్ 'విజయ' వత్సరం నుంచీ 'శరత్పూర్ణిమ చంద్రకాంతులను క్షణ క్షణమూ అందిస్తున్నట్లు, వేద ప్రమాణాన్ని ప్రజలకు **'ఐ.సర్వ్'** కణకణము ప్రజలకు చేరి జ్వలింపచేస్తుందని విశ్వసిస్తున్నాను. ●

# 'పద్మశ్రీ' గుత్తా మునిరత్నం - రాయలసీమ సేవారత్నం!

## - మంచి స్నేహితుడూ - పదిమంది మంచినీ కోరేవాడూ! -



వటుడింతై, అంతై, ఆకాశమంతై - అన్నట్లు - నాకు ప్రథమంగా చెన్నయ్ త్యాగరాజ నగర్‌లో పరిచయమై, పరిచయం ప్రగాఢ స్నేహమై, ప్రతీరోజూ ప్రతిబింబాన్ని చూచుకుంటున్నప్పుడు - అతని నెమ్మది, నిదానం, నిరాడంబరత, నికార్సుతనములనే చూచానుగానీ, ఏడుకొండలంత ఎత్తుకు గుత్తా మునిరత్నం ఎదుగుతాడని ఊహించలేదు. పత్రికా రంగం అంటే అతనికెంతో యిష్టం, ముద్రణారంగం మరీ యిష్టం, ప్రచురణారంగం మరీ మరీ యిష్టం.

ఆ ఖద్దరు లుంగీ కట్టుపంచ, ఆపై ఆ ఖద్దరు లాల్చీ, కండువా మాత్రం అప్పుడూ ఇప్పుడూ చూడలేదు. అలాగే ఆ మోముపై చిరునగవు అన్నీ యధాతథంగానే ఉన్నాయ్. తేడా అల్లా అతని శిరోజాల రంగు తెల్లగా మారిపోవడం, వ్యాపారకోణం నుంచీ సేవారంగంలోకి మారిపోవడం, తిరుపతి గోవిందరాజుల గోపురం అంత ఎత్తుకు ఎదిగీ కూడా ఆవగింజతయినా అహం ప్రకటించకపోవడం, ఆనాడూ ఈనాడూ ఆ ముఖంలో ఆనందం సదా విరాజిల్లుతూండడం చూస్తే - ఈయనకేఁవీ మనోబాధలుండవా, చీకాకులు కలుగవా? కూడా ఉండేవాళ్లను చీదరించుకోడా, ఏఁవిటబ్బా, ఈ మనిషి అనుకున్నా, ఎంతో పరపతి సంపాదించి పదవులకెగపడలేదు. 'పద్మశ్రీ' వెతుక్కుని ఆయన వద్దకే వచ్చింది. మొన్నమొన్న తిరుపతిలో జరిగిన నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల్లో మహనీయ సత్కారం పొందడం (నేనూ పొందాను కాబట్టి) ప్రత్యక్షంగా చూచి ఆనందించాను. ఆయన అందని ఎత్తుకు ఎదిగి, ఎంతోమంది మంత్రులచే గౌరవింపబడ్డారని సంతోషపడుతూ, అందరి జనసంద్రంలో ఈదుకుంటూ వెళ్ళి కరచాలనం అందించలేకపోయా - అది నన్ను కొంత బాధించినా, ఆచార్య రంగా అనుయాయుడులే! ఏఁవీ అనుకోడు అనుకున్నాను. (గాకపోయినా మహాసభలు జరిగిన అడవీ ప్రాంగణంలో, ఎనిమిది పదుల వయసులో ఎనిమిది కిలోమీటర్లు నడిచి, శరీరశక్తి సన్నగిల్లి ఉన్నాను. 'మహనీయుని'గా ప్రపంచ తెలుగు మహాసభలు నన్నూ సత్కరించి ఇలా ఇన్ని కిలోమీటర్లు నడువమని యిచ్చిన పనిష్మెంటని సత్కారం స్వీకరించినట్లే స్వీకరించి కుర్చీలో సేద తీరుతూండడమే కారణమైంది).

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

చిన్నప్పుడు బాలానంద కార్యక్రమాల్లో పాలుపంచుకొన్న మనిషేఁమో - సేవా కార్యక్రమాలందభిరుచి చిన్నవయసులోనే అలవడింది. బాలానందం శాఖలను తిరుత్తణి, చిత్తూరు ప్రాంతములంతా వ్యాప్తి చేయడమే గాకుండా, తన వాలాన్ని గుంటూరు, హైదరాబాదు బాలమహాసభలకు పెంచుతూ, గుంటూరు సభలకు బెజవాడ గోపాలరెడ్డినీ, హైదరాబాద్ సభలకూ బూర్గుల రామకృష్ణారావు వంటి మహా నాయకులను పాల్గొనింపచేసిన ఉద్దండుడు మునిరత్నం.

పుట్టింది రాయలసీమ ప్రాంతమే - ఇప్పుడది తమిళనాడులో చేరిపోయింది. నెమలి గ్రామంలో పుట్టి సీతానగరంలోనూ, కనకమ్మ సత్రంలోనూ ప్రాథమిక విద్యను (అయిదో తరగతి వరకూ) పూర్తి చేసిన విశ్వాసమో, అభిమానమో ఏమోగానీ కనకమ్మ సత్రంలో ఉన్నత పాఠశాలయేర్పడడానికి కారకుడయ్యారు.

రంగయ్యనాయుడు, మంగమ్మ దంపతులకు ఏకైక బూరి బుగ్గల కుమారునిగా లాలింపబడడంతో ఆటపాటలూ, సేవాభావం సమపాళ్ళలో ఎదుగుతూ వచ్చాయ్. పై చదువులకై మేనమామ యింటివద్ద ఉన్నారు. ఆయన కనేక బస్సులుండేవి. ఆ లెక్కలన్నిటినీ అత్తీసరు మార్కులతో ఉత్తీర్ణుడవుతూన్న మునిరత్నమే చూచేవాడట. చిన్నప్పట్నుంచీ ఖాళీగా కూర్చునే స్వభావి కానందున, మేనమామ బస్సుల్లో పనిచేసే క్లీనర్ రాకపోయినా, కండక్టరు రాకపోయినా, ఆ పనులను కూడా మునిరత్నమే చేసేవాడు. అలా ఒకసారి ఆ బస్సులో బయల్దేరి మద్రాసులోని 'ఆంధ్రప్రభ' ఆఫీసులోని సంపాదకుడు నార్ల వేంకటేశ్వరరావుని కలిసి, ఆంధ్రప్రభకు రాయలసీమ వార్తలు పంపే స్థాయికి ఎదిగాడు. బాలసాహిత్యం, ఆ సాహిత్యమూ, ఈ సాహిత్యములతో ఉద్యమాల్లో కాలుపెట్టి, తిరుత్తణి, బళ్ళారిలకు జరుగుతూన్న అన్యాయాలను ఏకరవు పెట్టారు. కరువుసీమ రాయలసీమను రాయలు రతనాలసీమగా మార్చాలనే ఉద్దేశంతో రాయలసీమ సేవాసమితిని (అదే 'రాస్')ను ప్రారంభించి, రాజకీయాలకతీతంగా, రాజకీయాలు చొరబడకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే గాకుండా ఎన్నో చేతి వృత్తులవారిని ప్రోత్సహిస్తూ, దేశంలోనే ఓ పెద్ద సేవా సంస్థగా తీర్చిదిద్దుతూ, ఓ పెద్ద సేవాభవంతిని నెలకొల్పి అనేక వృత్తి విద్యలలో ఉపాధి కల్పిస్తూన్నారు. ఒకసారి ఆ బృహద్భావనాన్ని చూచి, ఇదో భువనం అన్నాను. వీటన్నిటినీ విశ్లేషించడానికి ఈ పేజీ చాలదు కాబట్టి ఇంత కృషిచేసిన హితైషుడు మునిరత్నానికి దీర్ఘాయువును ప్రసాదించమని ఏడుకొండలతేడును ప్రార్థిస్తున్నాను. ●

# దేశ స్వాతంత్ర్య దర్శి వాగ్విభవ 'దర్శి'
# దర్శి లక్ష్మీ వేంకటేశ్వర వరప్రసాదరావు పంతులు

పూవు పుట్టగనే పరిమళిస్తుందంటారు. కానీ కొన్ని పువ్వులు పుడుతూనే పరిమళిస్తాయి – అన్నది కూడా వాస్తవం. ఒకాయన నాతో మాట్లాడుతూ, మావాడు ఆరునొక్క రాగంతో పుట్టలేదండీ, అష్టపదుల్లోని స్వరసరాన్ని బోలునట్లు విచిత్రంగా, మురళీమోహనంగా ఏడుపు వినిపించాడండీ! అన్నారు. నేను ఆశ్చర్యపోలేదు. తరువాత ఆయనే మావాడు రెండేళ్ళు వచ్చేసరికి వాకిటి వెనుకనున్న బొప్పాయి చెట్టు క్రింద పడిన బొప్పాయి గొట్టమును తీసుకుని కృష్ణుడు మురళిపట్టుకుని ఊదినట్టూదేవాడండీ! ఆ తరువాత వాడు పిల్లనగ్రోవి వాయించే ఫ్లూటిస్టయిపోయాడండి – అంటూ సంబరంగా చెబుతూన్న విషయంలో అత్యుక్తి ఉన్ననూ విశ్వసించక తప్పలేదు. ఘంటసాల వేంకటేశ్వరరావు గారు బొప్పాయి గొట్టములతోనూ, ఈలపాట రఘురామయ్య పిడికిడి పట్టి ఈల పాటనూ ప్రాచుర్యంలోకి తెస్తూ, తాము ప్రాచుర్యం పొందారు.



దర్శి లక్ష్మీ వేంకటేశ్వర వరప్రసాదరావు గారు ఏ దేవతా వరప్రసాదమో గానీ **కూజంతం రామరామేతి మధురం, మధురాక్షరం** అన్నట్లు తల్లి పార్వతమ్మ గారు గొప్ప సంగీత విద్వాంసురాలు కావ డంతో అక్షర అభ్యాసంతో బాటు స్వరక్షరా భ్యాసం జరిగింది. తెలుగు సినిమాలకు తొలుదొల్తగా పాటలు వ్రాసిన చందాల కేశవదాసుగారి **'బలే మంచి చౌక బేరమూ బలే బలే మంచి చౌకబేరమూ, మించినన్ దొరకదు సుజనులార బలే మంచి చౌక బేరమూ'** అనే పాటను ఆ తల్లి ఆ కుమారునికి అతి తేలిక పదాలతో నేర్పడం 'దర్శి పంతులు' గారికి సంగీతం అతి తేలిగ్గా అబ్బింది, అచ్చొచ్చింది.



దర్శి దంపతులు రాధాకృష్ణరాజ దర్శనం

తండ్రి వేంకటసుబ్బారావు గారికి కూడా నాటకాలంటే మహాప్రీతి. అబ్బూరి వర ప్రసాదరావు వంటి పద్యనాటక నట ప్రవీణులతో ఆయనకు మంచి పరిచయాలు ఉండేవి. ఆయన కుమారునిలోని పద్య పఠనాసక్తి, రసరమ్యతలను జూచి, 'శ్రీ రాఘవం దశరథాత్మజ యప్రమేయం సీతాపతిం, రఘుకులాన్వయ రత్న దీపం' అనే పదరంజిత ప్రబంధ పద్యాన్ని నేర్పించడం, 'దర్శి ప్రసాదరావు పంతులు' మస్తకంలో సంగీత స్వరసరముల్లో మంచి బీజాలు నాటినట్లయింది. ప్రాథమిక విద్యతో బాటు భక్తిరస పద్యపఠనం, పద్యాలాపనం చేస్తూ వచ్చారు. తొమ్మిదవ ఏటనే ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి సభలో 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు' అని పోతనగారి భాగవతంలోని పద్యం మధురంగా ఆలపించి, 'సెహబ్బాష్' అనిపించుకున్నారు. ప్రకాశం పంతులుగారి ఆశీస్సులు లభించడం అంత తేలిక కాదు. ఆరోజులో దర్శి ప్రసాదరావు పంతులు సాధించిన ఘన విజయమనే చెప్పాలి.

భారద్వాజస గోత్రంలో, ఆరువేల నియోగీ బ్రాహ్మణుల్లో – ఇటు రచయితలు, నటులు, దేశ నాయకులు, త్యాగధనులూ, దానపరులూ, శ్రీమంతులూ ఉన్న సువర్ణ కాలం అది. సహృదయత్వం, సౌజన్యం సంపదలూ విలసిల్లుతున్నవారు, అందర్నీ తమవంటి వారిగానే చూస్తూ అట్టడుగు వర్గాల వారిని అన్నివిధాలా ఆపద్బాంధవులుగా మసలుకుంటూ ముస్లిముల వద్ద కూడా అత్యున్నత పదవులను చేసి, అందటివారుగా ఆరువేల నియోగులు పేరుగన్నవారు అలాటి కులీన వంశంలో దర్శి ప్రసాదరావు పంతులుగారు జన్మించడం 'దర్శి' వంశంలో 'కనకమయ చేలుడ'నిపించుకున్నారు. వయసు తొమ్మిది అంచులలో ఉన్నప్పుడు, తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయా'ల్లో వికర్ణునిని పాత్ర ధరించారంటే అన్నప్రాసనం రోజుననే ఆవకాయ అన్నాన్ని తిన్నారనే చెప్పుకోవాలి. బాల్యదశ నుండీ యౌవన దశలో ప్రవేశించినప్పుడు శరీరావయవాలు ఏ రీతిగా అభివృద్ధి పొందుతాయో, అలాగే ప్రసాదరావు పంతులు 'శ్రీరామాంజనేయ యుద్ధం' నాటకంలో శ్రీరాముని పాత్ర, పాండవోద్యోగ విజయాలు నాటకంలో శ్రీకృష్ణునిపాత్ర ధరించారు. ఆరోహణ క్రమంలో ఒక్కొక్క మెట్టునే పాత్ర పోషణలోనూ, పద్యధారణలోనూ గొప్ప సొంపునూ అభివృద్ధిని చేస్తూ వచ్చారు. 1990 సం॥ము బెంగుళూరులో జరిగిన అఖిల భారత తెలుగు రచయితల మహాసభల్లో 'కురుక్షేత్రం' నాటకంలోని పదక అంకంలో ప్రఖ్యాత రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు దుర్యోధనుని పాత్ర ధరించగా, ప్రసాదరావు పంతులు శ్రీకృష్ణుని పాత్ర ధరించి మెప్పించడం గమనార్హం... క్రమేణా నాటకరంగం నుంచీ సినిమా రంగంలో ప్రవేశించిన శుభఘడియ లేమో 'మల్లెల మనసులు' నటించిన వేళా విశేషమేమో – వేటపాలెంకు చెందిన 'మల్లెం' వారి అమ్మాయి 'శ్రీలక్ష్మి'తో వివాహం కావడం, 1974 సం॥ములో బెంగుళూరుకు మకాము మార్చడంతో జీవితరూపు రేఖా, వృత్తి, ప్రవృత్తిల్లో ఘనమైన మార్పులు పురోగమన పథంలో సాగాయ్. సుఖసంసారం నాటకాలూ, సినీమాల్లో నటించడం, యువతీ యువకులకు తర్ఫీదునివ్వడం, రియల్ ఎస్టేటు వ్యాపార రంగంలో ప్రవేశించడం, నగరానికి నగల్లాటి పెద్దలు రాధాకృష్ణరాజు, ఆదికేశ వులు నాయుడు, జె.ఎస్.రెడ్డి ప్రభృతులతో పరిచయం, **ఒక అబ్బాయి, ఒకమ్మాయి అన్నట్టు – ఒక కొడుకు ఒక కూతురుకు తండ్రి కావడం** – కుమార్డు శివమారుతి బి.కామ్. చదివి వ్యాపారం చేస్తూండడం, కుమార్తె అనూరాధ ఎం.ఎస్.సి. సైకాలజీ పట్టభద్రురాలు కావడం వాక్సిరితో అందరికీ కావలసిన వానిగా స్నేహసిరిని పెంచుకుంటూ సంపదసిరిని కూడా పెంచుకున్న ప్రసాదరావు పంతులు సంతానసిరిని పెంచడంలో విభిన్న దయ్యాడెలా అంటే వారి తండ్రి గారికి ఏడుగురు కుమారులూ, ఏడుగురు కుమార్తెలైతే – తను మాత్రం సంతానం విషయంలో పొదుపరి అయ్యారు. కానీ పుంఖాను పుంఖంగా తన గాత్రసిరి సంపదను పలు సి.డి.ల ద్వారా, సభల్లో స్వరారాధకునిగా పద్యాలకు పద్యాలు సగరుని సంతానంలా సంగీత సాగర విస్తృతిని పెంచేస్తూ, తన షష్ట్యబ్దుత్సవంలో కవులూ, పండితులూ, మహామహులచే 'గానకోకిల' బిరుదముతో సత్కరింపబడడం కృషీ ఫలితమైన ఖుషీ వార్తగా చెప్పుకోవాలి. పద్యం పాడడంలో నాలుక పెదాలకు తాకకుండా పాడడంలో ఘనాపాటీయని ఫోనులో పాట విని గ్రహించాను. ఆయన తన పేరును 'పంతులు'యని కుదించుకొన్నట్లుగానే, నేనూ ఆయన పద్యాలాపనా తీరును కుదించక తప్పలేదు–కానీ వారి అపార పారావార ఆలాపన విద్యను అభినందిస్తున్నాను. ●


# రాళ్ళపల్లి అన్నపూర్ణమ్మ

## -రతనాల వంటి భావాలు కల మహిళా మండలి సేవాకర్త, అధ్యక్షురాలు-



చల్లా సావిత్రమ్మ విశ్వనాధం దంపతులకు 1938 సం॥ ఏప్రిల్‌లో జన్మించిన అన్నపూర్ణమ్మ గారికి సాంప్రదాయాల పట్ల ఎంత మక్కువ ఉన్నదో, అంతకన్నా మించిన మక్కువా, ఆసక్తి స్త్రీ సంక్షేమం పట్ల ఉన్నది. స్త్రీలు తప్పనిసరిగా చదువుకోవాలి, సంస్కారం పెంచుకోవాలన్నది అన్నపూర్ణమ్మకు చిన్నప్పట్నుంచీ కుటుంబ సాంప్రదాయంగా కొనసాగుతూ వచ్చిన మేల్మనసులో గూడు కట్టుకున్నది.

సంతరావూరులో ప్రాథమిక విద్య, మెట్రిక్యులేషన్ వరకూ చెన్నయ్‌లోనూ మరల కాలేజీ విద్య గుంటూరులోనూ కొనసాగడంతో పల్లె, పట్నాల పడతులు పడ్తున్న కష్టాలన్నిటినీ ఆకళింపు చేసుకున్నారు. అప్పుడే ఆమె ఆడవాళ్ళు చదువుకొంటేనే ప్రయోజనం ఉంటుందని గ్రహించారు. పెద్దయ్యాక ఆమె వాటిని ఆచరణలోనికి తెచ్చారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో వైస్ ఛాన్సలర్‌గా పనిచేస్తున్న రాళ్ళపల్లి రామమూర్తిగారితో వివాహమైన తరువాత, ఆమె నివాసం తిరుపతికి మారింది. రామమూర్తి మంచి విద్యాసంపన్నుడే కాదు, వినయమూ, విజ్ఞానమూ, ఆధ్యాత్మిక సంపన్నతలు కలవాడు. వారిద్దరి దాంపత్యమూ ఎంతో అన్యోన్యంగా సంఘ సేవా దృక్పథంతో బాటు ఆధ్యాత్మ సంపన్నంగా సాగిందనడానికి వారు చేసిన సేవలనే చెప్పుకోవచ్చు. భార్య అనుకూలవతి గాకపోతే, సంసారం యెలా వుంటుందనేది వేమనగారే తన పద్యంలో చెప్పాడు.



శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి ఆశీస్సులందుకుంటున్న రామమూర్తి అన్నపూర్ణ దంపతులు

**మాట వినని యాలు మగనికి మృత్యువు**
**యోటి పడవ సర్పమోంటి గృహము**
**తనకు గాని దానవురాలయా–** అని

అనుభవించి నట్టు చెప్పాడు. వేమన చరిత్ర ప్రకారం ఆయన పెళ్ళే చేసుకోలేదు. సమకాల చరిత్రలో అటువంటి సంభవాలను ఆయన చూచి ఉండవచ్చు. అదే వేమన గారు:

**సుగుణవంతురాలు సుదతియై యుండిన**
**బుద్ధిమంతులగుచు పుత్రులొప్ప**
**స్వర్గమేటికయ్య సంసారికింకను –** అన్నారు. స్త్రీ అండ లేకపోతే దేవునికి కూడా సరిగా సుఖం ఉండదని రొఖ్ఖాయించి చెప్పాడు.

**గుణవతి యగు యువతి గృహము చక్కగా నుండు –**
**చీకటింటి దివ్వె చెలగురీతి**
**దేవియున్న యిల్లు దేవార్చన గృహంబు**

– అని చెప్పినట్లు నేను తిరుపతి వెళ్ళినప్పుడు వారింటికి వెళ్ళి చూసాను. నిజంగా, వేమనగారు చెప్పిన దేవతార్చనా గృహంలా ఉన్నది. ఆమె శ్రీ పద్మావతీ ప్రార్థనా మహిళామండలి అధ్యక్షురాలు. అంతేగాక అన్నపూర్ణమ్మ శ్రీ పద్మావతీ ప్రార్థనా మండలికి అనుబంధంగా స్త్రీల వసతి గృహాన్ని 'Women's Hostel' స్థాపించిన స్థాపకాధ్యక్షురాలు. ఇల్లు చక్కదిద్దుకుంటూ సంతానాన్ని సత్సంతానంగా తీర్చిదిద్దడం వల్లనే రామమూర్తిగారు ఇండియన్ సైన్సు కాంగ్రెసు అధ్యక్షులై, విశాఖపట్నంలో 99వ సైన్సు కాంగ్రెసును ఆంధ్ర విశ్వవిద్యాలయం వారితో కలిసి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి బ్రహ్మోత్సవాల్లా అంకితభావంతో అత్యంత వైభవంగా జరుపకలిగారు. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి, దేశదేశాల శాస్త్రకారులూ ఆ ఉత్సవాల్లో పాల్గొన్నారు. నిజానికదొక తిరునాళ్ళగా జరిగిపోయిందంటే రామమూర్తి గారి వెనుక అన్నపూర్ణమ్మగారుండీ కార్యక్రమ నిర్వహణా క్రమంలో అమేయంగా సహకరించారు. దీనికి ప్రత్యేకాహ్వానితునిగా వెళ్ళి చూచిన ప్రత్యక్షసాక్షిని.

రామమూర్తి గారు తిరుపతిలోని శృంగేరీ మఠానికి ధర్మాధికారి. జీర్ణస్థితిలో ఉన్న ఆ భవన స్థానంలో నాలుగంతస్థుల భవనంగా నిర్మించి, దశాబ్దంన్నరగా తిరుపతి రాని శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారిని రప్పించడం, నాకు కూడా చాలా సంవత్సరాల తరువాత శృంగేరీ జగద్గురువులను దర్శించే భాగ్యం కల్పించడం, ఆ గురుపూజా మహోత్సవం మహోన్నతంగా జరగడంలో అన్నపూర్ణగారు రామమూర్తిగారి అర్థశరీరిగా బాధ్యత వహించారు.

### శ్రీ పద్మావతీ ప్రార్థనమండలిలో ప్రధాన పాత్ర!

శ్రీ పద్మావతీ ప్రార్థనామండలి అధ్యక్ష పీఠం అధిష్ఠించే ముందు, నరసరావుపేటలోని కస్తూరిబాయి మండలి, గుంటూరు, మచిలీపట్టణములోని ఆఫీసర్స్ క్లబ్ స్త్రీ సంక్షేమ శాఖలో మహిళల కోసం అమేయంగా పనిచేసారు. 1963 సం॥ములో తిరుపతిలోని శ్రీ పద్మావతీ ప్రార్థనామండలి స్థాపక సభ్యురాలిగా, అధ్యక్షురాలుగా అకుంఠితమైన దీక్షతో మహిళా సేవ కార్యక్రమాలను చేబట్టారు. విద్య, విజ్ఞత, ఉపాధి విషయంలోనూ స్వయంవృత్తి వ్యాపారాలను చేసే మహిళలకు జాతీయ బ్యాంకుల నుంచీ ఋణాలు సేకరించి యివ్వడంలోనూ, అన్నపూర్ణ గారిచ్చే ప్రోత్సాహం, ప్రోద్బలమూ అపారము. ఈమెకు పద్మావతి మహిళా కళాశాల పూర్వపు ప్రధాన బోధకురాలు శ్రీమతి రాజేశ్వరీమూర్తి. పింగళి లక్ష్మీకాంతమ్మ, శ్రీమతి టి.రామమ్మ, శ్రీమతి నడింపల్లి లక్ష్మీనరసమ్మమ్మగారు ఎంతో చేదోడై ఉన్నారు. మండలి ప్రాంగణంలో మహిళా ఉద్యోగినిల వసతిగృహం ఏర్పరచడానికి స్థానిక లోక్‌సభ సభ్యుడు శ్రీ చింతామోహన్ ఎంతో సహకారమందించారు. ఇంతగా శ్రమిస్తున్నా, 75 సంవత్సరాల వయసు మీద ఉరికిపడినా, ఇంకా ఏదో చేయాలనే తపన ఆమెలో నిబిడీకృతమై ఉన్నది. వృద్ధుల విశ్రాంతి గృహం స్థాపించాలనే తపన ఉన్నది.

ఇవిగాకుండా భర్త రామమూర్తి గారితో శృంగేరి మఠం, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయం, శారదా ఆలయం నిర్వహణలతో ఆమెకు క్షణం తీరిక ఉండదు. క్షణం అలసట ఉండని దాంపత్యమున్నదంటే రామమూర్తి అన్నపూర్ణమ్మ దంపతులదే! ఈ దంపతులు సమాజ సేవ చేస్తూ, ఆ చంద్రతారార్కమూ ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లాలనీ, సమాజాన్ని వర్ధిల్లేట్టు చేయాలని మనసారా కోరుకుంటున్నాను. ●

**ఈ దంపతులకు ఇద్దరు కుమారులు రవికుమార్ అమెరికాలో ఉంటున్నారు. కుమార్ ఫైజర్ కంపెనీలో పనిచేస్తున్నారు. కుమార్తె లు॥సౌ॥ రోహిణి - ధూళిపాళ ప్రసాద్, కూతురు, అల్లుడూ, మనుమలూ, మనుమరాళ్ళతో నిండైన కుటుంబం.**

# వంశీ ఇంటర్నేషనల్ హైదరాబాద్ వారి మహిళా దినోత్సవం

ఏ మంచి కార్యం తలపెట్టినా అందు మనసు నుంచీ మహాయాగం చేసినట్లు చిత్తశుద్ధితో చేయడంలో వంశీ రామరాజు ఘట్టివాడు. 'అ' కారం (అక్కినేని జన్మదినం), సి.నారే (సి.నారాయణరెడ్డి జన్మదినం) 'సు.రా.రె' (సుబ్బరామిరెడ్డి జన్మదినోత్సవం) కార్యక్రమాలను క్రమం తప్పని, క్రమశిక్షణారాహిత్యం కాని బృహత్కార్యక్రమాలుగా చేస్తూ, మధ్య మధ్య కళాసాహితీరంగ కార్యక్రమాలను మాసానికొక్కటి చొప్పున మాససంపందే విధంగా జరపడం రామ రాజుకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన వెనుక శరీరార్థ భాగినియైన తెన్నేటి సుధాదేవి బలిమిగా ఉంటూ, కార్యక్రమం విజయవంతం చేయడంలో 'దిట్ట'యని ఇటీవల జరిపిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం ఋజూపరిచింది. రామునికి మారుతిలా కె.ధర్మారావు కొండంత బలం, గోరంత దీపానికి కొండంత వెలుగునిచ్చే త్యాగరాయ గానసభ అధినేత కళాదీక్షితులు కళలకు నిలయుడై వెన్నంటిఉంటారు. ఈ 'టీము'లోని 'క్రీము' ఇంతింత కాదయా యని చెప్పడం నా బాధ్యతయైంది. 'వంశీ' వర్ధిల్లు వెయ్యేళ్ళు. ●



21.02.2013న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా వంశీ విజ్ఞానపీఠంలో శ్రీత్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన దూరదర్శన్ సంచాలకులు శైలజా సుమన్‌ను సత్కరిస్తున్న విద్వాన్ తెన్నేటి - చిత్రంలో తెన్నేటి సుధాదేవి, షేక్‌బడే సాహేబ్, కె.ధర్మారావు, వంశీ రామరాజు. ద్వా.నా.శాస్త్రి, పి.రాజేశ్వరరావు, డా॥ కళావేంకట దీక్షితులు

# మళ్ళీ ఉమ్మడి కుటుంబాలు వెలుగు చూస్తాయ్!

**డా॥ ఎం.ఎస్.రెడ్డి, తిరుపతి**



వృత్తిరీత్యా ఎం.ఎస్.రెడ్డి గారు తిరుపతిలోని పాజిటివ్ హోమియోపతిలో సీనియర్ డాక్టర్. నిశిత పరిశీలనా దృష్టి కలవారు గానీ హోమియో పతిలో రాణించలేరు. సహనం, సహృదయత వారికెంతో అవసరం. దాదాపు 3000 మందులకు పైగా కల హోమియో మందులను రోగి నైతికతను పరిశీలించి ఔషధ నిర్ధారణ చేయడం అవసరం. సరియైన పరిజ్ఞానం ఉండి రోగి గుణాలను క్షుణ్ణంగా పరిశీలించి మందు యిచ్చేవాడుంటే హోమియో రోగాన్ని మొదటి కంటా త్రుంచి వేస్తుంది. ఈ విషయంలో పాజిటివ్ హోమియోపతి అధినేత **డా॥ ఎ.ఎం.రెడ్డి** పాజిటివ్ దృష్టితో ఈ హోమియో వైద్యశాఖలను అనేకచోట్ల సమర్థులైన డాక్టర్లతో నెల కొల్పారు. పిల్లల రోగాల చికిత్సా విధానంలో కూడా ఆయన అనేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. మా నాన్నగారు గోటేటి విస్సంరాజుగారు హోమియో వైద్యంలో నిపుణులు, దీర్ఘకాలిక రోగాలను కూడా కుదిర్చేవారు. అందుకే ఇంతటి సుదీర్ఘ ఉపోద్ఘాతమివ్వవలసి వచ్చింది. ఇహ డా॥ ఎం.ఎస్.రెడ్డి గారి విషయానికి వద్దాం. ఆయన సర్వజన హితైషి. శాంత స్వభావుడు. ఒకసారి పరిచయమైన వారెవరూ ఆయన స్నేహాన్ని విడిచిపెట్టరు. మీదు మిక్కిలి రెడ్డిగారు తిరుపతి వాసి.

ఆయన వర్ధమానతరం ప్రవర్ధమాన దశకు రావాలంటే - ఉమ్మడి కుటుంబాలు రావాలి. పెద్దలను గౌరవించాలి. భూమి గుండ్రంగా ఉండి గుండ్రంగా తిరుగుతున్నట్టు సమిష్టి భావాలూ, సమష్టి కుటుంబాలు రావాలి. పెద్దల మాట చద్దిమూట అనే సామ్యం మనకున్నది. చద్ది అంటే యిప్పుడెవరికీ తెలియదు. పూర్వం ఎవరూ కాఫీ, ఫలహారములు చేసేవారు కాదు. గత రాత్రి వండిన అన్నాన్ని ఏ అవకాయో, చింతకాయ పచ్చడితోనో తొలి ముద్దలు తిని, తరువాత తోడు పెరుగు అన్నం తిని, పనులకు వెళ్ళేవారు. ఇప్పుడా అలవాటుతో పాటు నలుగురూ కలిసి ఉండే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయింది. వేఱు కాపురం వెళ్ళి దంపతులు ఇద్దరు ఉద్యోగాలకు పోవడంతో, సంతానం చూచుకునేవారు లేరు. సలహాలిచ్చే పెద్దలు లేరు. ఇప్పుడా లోటు యువతకు తెలుసొస్తున్నది. దీనితో ఉమ్మడి కుటుంబాలందు యెంతగా సుఖం అనుభవించేవారో, పెద్దల సలహాలెంతగా భరోసా యిచ్చేవో తెలుసుకొనే జ్ఞాననేత్రం కనురెప్పలు విప్పుకుంటున్నది. మనిషికి ప్రశాంతత, స్థైర్యం లేకపోవడంతో ఏదో లోటును అనుభవిస్తున్నాడు. మానసికంగా, ఒంటరితనం బాధిస్తున్నది. అందుకే ఉమ్మడి కుటుంబాలు తిరిగి ఏర్పడుతాయని భావిస్తున్నాను, ఏర్పడాలి అన్నారు. ●

*Lovely Stay at Holy Tirupathi*    *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**

# పదిమందికి మేలు చేయాలనే తపనగల బొమ్మన రాజ్‌కుమార్!

వస్త్ర వ్యాపారంలో భారీ షోరూమ్‌లు వాటికి శాఖోపశాఖలు – తక్కువ ధరలకు వస్త్రములు విక్రయించడం బొమ్మన బ్రదర్స్‌తోనే ప్రారంభమైంది. రాజమండ్రీ కోటగుమ్మం దగ్గరకు వెళ్ళేసరికి బొమ్మనరాజ్ కుమార్ వస్త్రాలయం కనపడుతుంది. బొంబాయి మిల్లుల వద్ద భారీ యెత్తున వస్త్రాలను కొని, కొనుగోలు ఖర్చులపై స్వల్ప లాభం వేసుకుని నాణ్యమూ, నాజూకుతనమూ మార్కెట్లో కనపడని అరుదైన డిజైను గల వస్త్రాలను క్రయం చేసి, స్వల్పలాభంతో వస్త్రాలు అమ్మడం, బొమ్మన కుటుంబీకులు చేసిన తొలి సాహసం. అదే క్రమాన్ని బొమ్మన రాజ్‌కుమార్ కొనసాగిస్తూండడమే గాకుండా జనహితైషిక కార్యక్రమాల్లో కొంత లాభం మూటగట్టి ఖర్చుపెడ్తున్న బొమ్మన రాజ్‌కుమార్ అంటే రాజమండ్రీ వాసులకు ఎడతెగని అభిమానం, ఇంటిల్లిపాదికి ఒకేచోట వస్త్రాలను కొనే సాంప్రదాయాన్ని అలవరచుకొన్నారు. రాజ్‌కుమార్ పెద్ద వస్త్రవ్యాపారవేత్త మాత్రమే కాదు, పెద్దల పట్ల వినయ విధేయతలూ భక్తీ కలవాడు, ఆధ్యాత్మిక భావుకుడు తనను అంతగా వ్యాపార పెద్దను చేసిన సమాజానికి తిరిగి సహకారం అందించాలనే త్రికరణశుద్ధితో ఆలోచించి, దానధర్మగుణాన్ని పెంచుకొన్నాడు.



ఒకసారి నేను వీరభద్ర దైవజ్ఞ బుట్టేగారితో వారి మెగా షోరూమ్‌కు వెళ్లాను. అప్పుడు మిల్లుల నుంచీ వచ్చిన వస్త్రాల బేళ్లను లెక్కచూచుకొంటున్నారు. మమ్మల్ని చూడగానే లేచి నిలుచుని గౌరవ వందనం చేసే సహృదయునిగా స్వాగతించి, బుట్టేగారితో మాట్లాడే మాటలు మాట్లాడి, నన్ను పరిచయం చేసినప్పుడు ఎంతో వినయంగా మాట్లాడి, నాకూ, బుట్టేగారికి తేనీరు తెప్పించి నాకో పట్టు జరీ కండువా బహూకరించి ప్రముఖాంధ్రకు పాట్రన్‌గా సహకరించారు. ఆయన రాజకీయాల్లో ఏ పార్టీలో అడుగు పెడితే – ఆ పార్టీయే ప్రాచుర్యంలోకి వస్తుంది. వై.యస్.ఆర్. కాంగ్రెసు పార్టీ నాయకునిగా ఆయన చేస్తున్న జనహిత కార్యక్రమాలు ప్రజలను బాగా అలరించాయంటున్నారు. ఆయన హస్తవాసి మంఛిదని పలుమంది వ్యాపారులు ఆయన చేతులమీదుగా వ్యాపారాలను ప్రారంభింపచేస్తారు. ●


## 120 ఏండ్లు బ్రతకగలరనుకున్నా – 25 ఏండ్లు తక్కువ చేసుకొన్నారేమన్నా!

## పి. రమణారెడ్డి గారూ!!

'విజయ' తరంలోని నేత పి.రమణారెడ్డి గారు 'విజయ' నామ సం॥రం చూడకుండానే మార్చి 6న దివంగతులు కావడం, మా మానసము నెంతో బాధించింది.

**ఒరులే యవి యొనరించిన**
**నరవర యప్రియము దనమనంబునకగు దా**
**నొరులకు ననిసేయకునికి**
**పరాయణము పరమధర్మ పథములకెల్లన్**

– అని, 'మహాభారతం'లో తిక్కనగారు చెప్పి నట్లు – మనం ఇతరులకు చేసే పనులు మనసు లను యెలా నొప్పిస్తాయో–అలాటి నొప్పించే పనులను మనం చేయక పోవడమే అన్ని ధర్మాల కన్నా గొప్ప ధర్మం అన్నారు. అలా తాను నొవ్వక ఇతరులను నొప్పించినవాడు పి.రమణారెడ్డి గారు. సారపు ధర్మాన్నీ, విమల సత్యాన్నీ, పాపము బొంకులను దరిచేర్చకుండా 'విజయా' సంస్థలకు సేవలు చేసినవాడు. ముఖ్యంగా విజయా హెల్తు సెంటర్ అనగానే నాగిరెడ్డి గారి పేరు వెనుక వచ్చే పేరు రమణా రెడ్డి గారే! ఆయనకు బంధువూ స్నేహబంధమూ సేవా బంధం కల వారెవరూ అని ప్రశ్నించుకుంటే ముందు వచ్చే పేరు రమణారెడ్డే! ఆయన్ను నాకు పరిచయం చేసినది నాగిరెడ్డి గారే! నాగిరెడ్డి గారి చివరి కాలమంతా చింతనాకాలమే! సతీమణి పోయిన తరువాత మరీ ఒంటరి అయ్యారు. అయినా ఆయన విజయా హెల్తు సెంటర్ అభ్యున్నతికి అనుక్షణమూ మంచం పట్టేవరకూ హెల్త్ సెంటర్ అభివృద్ధిని చేస్తూనే ఉండేవారు. ఆయనకు 'విజయ' సంస్థల ప్రారంభం నుంచీ, ముఖ్యంగా హెల్తు సెంటర్, ఆసుపత్రుల కార్య కలాపాల్లో నీడలా ఉన్నదీ, ఆయన మరణించిన తరువాత, నాగిరెడ్డి మానసిక పుత్రికయైన హెల్తు సెంటరు అభివృద్ధిని చేస్తూ, కంటికి రెప్పలా చూచుకొన్నదీ రమణారెడ్డి గారే! నాగిరెడ్డి ఆశయాలకనుగుణంగా జీవితం ధారవోసి, సేవాంకితం చేసినదీ రమణారెడ్డిగారే! రమణారెడ్డి విజయా ప్రొడక్షన్సు స్థాపక డైరెక్టర్, విజయా మెడికల్ అండు ఎడ్యుకేషనల్ ట్రస్టు స్థాపక ట్రస్టీ, బి.నాగిరెడ్డి గారి జీవితకాల సహచరులు. నాగిరెడ్డి చరమదశలో కూడా అనుదినమూ వెళ్ళి చూచేవారు. ఒకసారి నాగిరెడ్డి గారు నాతో మాట్లాడుతూ రోజూ సాయంత్రం రమణారెడ్డి ఒక్కడే వస్తున్నాడు. మీరు కూడా సాయంత్రం 6.00 గం॥లకు వచ్చి, ఒక గంట కాలక్షేపం యివ్వండి!' అని అన్నారు. అప్పుడు అవగాహనమైంది. నాగిరెడ్డీ, రమణారెడ్డి సన్నిహిత సాహచర్యం. ఆయనదీ సేవా దృక్పథం. దక్షిణ భారత రామకృష్ణ మిషన్ ప్రాంతీయ కార్యదర్శి శ్రీరామకృష్ణ మిషన్ కడప ప్రమోటర్. ఇంకా అనేక జనహితైష కార్యక్రమాల్లో పాల్గొన్నను సేవను తప్ప పేరు నాశించని సేవాశీలి. ●



## 'విజయ' నామ సం॥ సందర్భములో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'ప్రముఖాంధ్ర' అభిమానులకు అభినందనము.

# సర్వ మతాల పట్ల సమాదారణ చూపే భారతదేశ సనాతన ధర్మమా! నీకు శతకోటి వందనాలు!!





శత్రు సంహార సమర్థివే – అయినా, శత్రు మతము లను, కడుపులో పెట్టుకుని వారికి స్థానం కల్పించిన కరుణామయ తల్లి భారత జననీ! నీకు శతకోటి వందనాలు! తల్లీ! క్షమ, దయ తప్ప క్రోధము కక్ష, ప్రతీకారేచ్ఛ సుంతైనా లేని శాంతిదాయినివమ్మా! తల్లిపాలు త్రాగి రొమ్ము గుద్దే వారిపై ప్రతీకారము తీర్చుకోని పరమపావనివి తల్లీ! కౌరవుల వంటి శతాధిక పుత్రులు కలిగి క్షుద్బాధను కలిగిస్తున్నప్పటికినీ నీనుంచి కొంచెమైనా పుత్ర వ్యామోహం తొలగలేదమ్మా. వారిని ప్రేమించే ప్రేమ వారాశివి.

**నందన నామ సం॥రము దేశానికి ఆనందము కూర్చకపోగా, గర్భశోకమే కల్గించింది. ఇక 'విజయ' నామ సంవత్సరం అందరికీ విజయములను చేకూరుస్తుందని విశ్వసిస్తున్నావని తెలుసు తల్లీ!**

ఆడపిల్లలకు మానభంగాలు జరిగాయ్. ఢిల్లీలోని బస్సులో ఆరుగురు కిరాతకులు పెళ్ళికావాల్సిన పిల్లను ఘోరంగా అనుభవించి, కడుపులోని పేగులను తీసి నడిరోడ్డులో విసిరేసిన సంఘటన విశ్వానికంతా తెలిసిపోయింది. అయినా హత్యాచారాలు ఆగలేదు? ఆగుతాయని నమ్మకం లేదమ్మా! ఎందరు కన్నె పిల్లలు ప్రేమా ప్రేమా అంటూ దగాపడుతున్నారు. ఎందరు ఆడపిల్లలు భూమిమీద పడకుండా తల్లి గర్భంలో పిండ విచ్ఛేదనంతో చనిపోయారు. ఈ స్కానింగు చేసి, పుట్టేది ఆడపిల్లని తెలియగానే, ఆ గర్భిణిని యింటినుండి ఎందరిని పంపించేశారు. గర్భవిచ్ఛేధణ చేసారు. పుట్టీ పుట్టగానే చెత్తకుప్పల్లోనూ, శ్మశానంలో విడిచివచ్చారు. సామూహిక అ(హ)త్యాచారాలు జరిగాయ్. తరిమి తరిమి పట్టుకుని మానభంగాలు చేసి దేశ ప్రతిష్ఠను మంటగలుపుతూనే ఉన్నాఱు.

**చావుముండా కొడకల్లారా!** ఈ తల్లి ఒక స్త్రీయే కదరా! మీ భార్యా స్త్రీయే కదరా! ముళ్ళ మధ్య నున్న గులాబీ పువ్వు ఆ ముండ్లకు గాయపడదు. కానీ మనుషుల మధ్యనున్న మగువ కామాంధుడనే ముళ్లకు బలైపోతున్నది. మనిషి నైతిక విలువను కోల్పోతే సర్వమూ కోల్పోయినట్లే! నోటి నిండా దుర్భాషలు వస్తూంటే, మనిషి, సమాజం కలుషితమైనట్లే!!

వేదభూమియైన భరతభూమిలో భగవంతుడు మనుష్యులను సుగంధ పుష్పాలుగా పుట్టించాడు ఏ పుట్టె ముని గిందని మధురమైన పరిమళాన్ని నాశనం చేస్తున్నారు.

విజయ నామ సం॥ము గురుబలం గల ఏప్రిల్ 11 గురువారం నాడు వస్తున్నది. అసలైన గురువులు దైవాలు, తల్లితండ్రులేనని గ్రహించాలి. దైవాలు వంటి తల్లితండ్రులు తమ సంతానమును ధర్మప్రవక్తులుగా పెంచాలి. ఆ రెండూ మృగ్యాలై నందన వత్సరంలో మృగాలు చేసి, మానవత్వాన్ని నశింపచేసినవి. 'విజయ'నామ సంవత్సరమా! మృగాలైన వారిని మంచి (మనసు) కలవాళ్ళుగా మార్చు తల్లీ. భారతదేశ మానవుల మనసులు మంచివని విశ్వసించి, భగవంతుడు శ్రీరామునిగా అవతరించి, ధర్మాన్ని తాను ఆచరించి ఆదర్శపురుషునిగా, మర్యాదరామునిగా కీర్తిగన్నాడు. ద్వాపరయుగంలో ఆ భగవంతుడే శ్రీకృష్ణునిగా అవతరించి, ధర్మాన్ని ఎలా ఆచరించాలో 'భగవద్గీత బోధన చేసి జగద్గురువని కీర్తి'నొందాడు. అలాటి వంశీకుల వంశాకురమే కదా ఈనాటి భారతీయులు! 'గతం గతః 'యని చరిత్రను నశింపచేయవద్దు.

**గోబ్రాహ్మణ హితాయిచ** – అన్నారు మహర్షులు. ఈ రెండూ మనకు అహితములు! చాలాకాలం దేశ సేవ చేసి, అరవింద మహర్షిగా ఖ్యాతిగాంచిన ఆ మహాత్ముడు 'గోమాత, భూమాత, నదీమాత, తులసీమాత, భారత మాత'లను ఆరాధించే పౌరులున్ననాడే భారతదేశం పునః ప్రఖ్యాతి నొందుతుందన్నారు. అలాంటి ఆశ్రమంపై దుండగులు దాడిచేసారు.

సర్వదేవతా, సర్వమత, సర్వతీర్థ, సమిష్టి భావదేశమిది. ఈనాడు ఈ దేశంలో ఉన్న ఇతర మతాలవారందరూ ఒకనాటి హిందువులే! ఏకభావం లేక, మహిళలను కామదృష్టితో చూస్తూ, స్త్రీ (మాతల) భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్నారు. లక్ష్మీ సరస్వతులకు దూరమై విజ్ఞాన సిరిసంపదలకు దూరమవుతున్నారు.

## మలేషియా అభిమాని అల్లు సుబ్రహ్మణ్యంకు పూర్తి ఆరోగ్యం చేకూరాలి!

గౌ. పూజ్యనీయులు, సంపాదకులు శ్రీశ్రీ గోటేటి శ్రీరామారావుగార్కి అనేక నమస్కారములు, ప్రస్తుతం నా ఆరోగ్యం క్షీణించిపోయినందువలన, యెక్కువగా వ్రాయలేని పరిస్థితి ఉన్నందువలన విరివిగా వ్రాయలేదు. మీ(మా)యొక్క పత్రిక ప్రముఖాంధ్ర ప్రతి నెల వచ్చి నా హస్తాల్లో పడేటప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. అనేకవిధాలుగా మీతో సంప్రదించాలని అనిపిస్తున్నది, ఈ జాబు వ్రాసే సమయము నా చేతులు సహకరించలేనందున వ్రాయలేకపోతూ ఉన్నాను. మీ పత్రికలో మీ సంపాదకీయం, ప్రపంచ దేశాలలోని ప్రతీ తెలుగు వాడి భాష యొక్క ముఖ్యతకు మంచి ఉద్దేశ్యాన్ని తెలియపరుస్తూ భాష యొక్క ముఖ్యత్వం తెలుపుతూ మీ సంపాదకీయం ప్రతి తెలుగుభాషీయుడు ప్రముఖాంధ్ర పత్రిక వెలువడాలని ప్రార్థిస్తూ ఉన్నారు. వందనము

ఇట్లు సోదరుడు **అల్లు సుబ్రహ్మణ్యం**

## అభినందన లేఖ

**మాన్యశ్రీ గోటేటి శ్రీరామారావు గారికి నమస్కారములు**

దాదాపు 15 సంవత్సరాల క్రితము, మీరు గుంటూరు విశ్వమందిరానికి వచ్చినప్పుడు, మీతో నాకు పరిచయము కలిగినది. అప్పటినుండి మీపైన నాకు స్నేహభావము, ప్రేమాభిమానాలు ఏర్పడినవి.

మీరు పత్రికా రంగములో ఎంతో అనుభవం, సామర్థ్యంతో నడుపుచున్న తెలుగువారి అభిమాన మాస పత్రిక "ప్రముఖాంధ్ర". తెలుగువారి ఖ్యాతిని, తెలుగు భాషను, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని భారతదేశంలోనే గాక పలు విదేశాలలో ఉన్న భారతీయులు వీటిని గురించి మర్చిపోకుండా వారు పాటించి, పిల్లలకు తెలిపి వారిని చైతన్యవంతులుగా చేయడంలో మీ పత్రిక చేస్తున్న విశేష కృషి ప్రశంసనీయము. నూరు సంవత్సరాల క్రితం తరాల వారిని, ఈ తరాల వారిని అనేక రంగాలలో నిష్ణాతులైన వారిని పత్రిక ద్వారా సమాజానికి పరిచయం చేయడం ఎంతో సంతోషదాయకమైన విషయం. 50 సం॥ల నుండి మీకు సినిమా రంగంలో ఉన్న బంధం, అనుబంధం విడదీయరానిది. మీరు చేస్తున్న విశిష్టమైన సేవ లను గుర్తించి అనేకమంది పీఠాధిపతులు, యోగులు, మహాత్ములు శుభాశీస్సు లను అందజేశారు. శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ వారి దివ్యఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలని, ఉంటాయని ఆకాంక్షిస్తున్నాను. మీరు గుంటూరు వచ్చినప్పుడు ముఖ్యంగా మార్చి 7వ తేదీన నామీద ఉండే ప్రేమ, వాత్సల్యం వల్ల మా ఇంటికి వచ్చి మీకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకొనే అవకాశం కల్గించడం ఎంతో ఆనందదాయకం. భగవంతుడు మీకు నిండు నూరు వసంతాలు జీవితాన్నిచ్చి ఆయుః ఆరోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

ఇట్లు, మీ మిత్రుడు

**పులిపాటి సుబ్బారావు**

**జీ.వి. రావ్ పేజీ**
(గోటేటి వేంకటేశ్వరరావు)

భారతదేశంలో మనకు ఆదర్శం మాతృత్వమే. ఆ అద్భుతమైన, నిస్వార్థమైన తల్లి, అన్నింటినీ భరించి, ఎల్లవేళలా క్షమించే తల్లి మనకు ఆదర్శం. - స్వామి వివేకానంద



# తల్లి ప్రత్యక్ష దైవం

ప్రతి సంవత్సరం ఏప్రియల్ నెలలో మా అమ్మ గురించి ప్రస్తావిస్తూ వుంటాను. కారణం ఇప్పటి నా ఉన్నతికి కారణం అమ్మే. ఈ సృష్టిలో తల్లి ప్రేమను మించినది మరొకటి లేదు. తన బిడ్డలు ఆనందంగా వుండాలని, ఆరోగ్యంగా వుండాలని, సంస్కారవంతులుగా వుండాలని, ఉన్నతులుగా వుండాలని తనయొక్క సర్వస్వాన్ని త్యాగం చేస్తుంది. ఎప్పుడు తన పిల్లలు గురించే ఆలోచిస్తూ వుంటుంది. మన భారతీయ సంస్కృతిలో అందునా హిందూ ధర్మంలో అమ్మకు అత్యున్నత స్థానం కల్పించింది. మాతృదేవోభవ అంటూ కన్నతల్లికి అగ్రతాంబూలం ఇచ్చారు. నవమాసాలు కని పెంచిన తల్లియే మన అదృష్టానికి, అభివృద్ధికి మూలకారణం. తల్లి దీవెన వుంటే చాలు, దైవం మనల్ని అనుగ్రహిస్తాడు. తల్లిని మించిన దైవము లేదు. నావరకు నేను చాలాసార్లు ఈ జీవిరావు పేజీలలో చెప్పినట్లుగా చిన్నప్పటి నుంచి అమ్మ, నాన్నలని అంటి పెట్టుకుని ఉండేవాడిని. అదే లోకం అనుకుంటూ వుండేవాడిని. బయట పరిచయాలు లేకపోతే ఎలాగరా, నలుగురిలోకి వెళ్ళమని, ఆయనతో రమ్మని నాన్న పిలిచినా మీరున్నారు చాలు అంటూ వుండేవాడిని. (కాని ఈమధ్యే బయటకు వస్తూ వున్నాను) నాన్న మందలించినా అమ్మ వెనకేసుకు వస్తూ వుండేది. ఎప్పుడు అమ్మ గురించి ఆలోచిస్తూ వుంటాను కాని గత రెండు మూడు నెలలుగా మరీ ఎక్కువగా అమ్మ ఆలోచనలోనికి వస్తూ వుంది. కారణం మా పెద్దమ్మాయి దివ్య పెళ్ళి పనులవలన. నాకు ఇద్దరు ఆడపిల్లలు. అమ్మ నన్ను ఎప్పుడూ హెచ్చరిస్తూ వుండేది. ఒరేయ్ నీకిద్దరు ఆడపిల్లలు, జాగ్రత్తగా ఖర్చు చెయ్, పెళ్ళికి ఇప్పటినుంచే వెనకెయ్, బంగారం చిట్‌లు కట్టు అంటూ పదే పదే చెప్పి, నేను విసుక్కున్నా మందలిస్తూ ఆ పని చేసేదాకా విడిచిపెట్టేది కాదు. అలా అప్పుడు అమ్మ ఇచ్చిన సలహానే ఈరోజు నేను మా అమ్మాయి పెళ్ళి తలపెట్టినప్పుడు నాకు కొంత టెన్షన్ లేకుండా చేసింది. ఆరోజు నేను అమ్మ సలహా వినకపోయుంటే అనే ఆలోచన నాకు పదే పదే వస్తూంటుంది. నాకన్నా కూడా మా అమ్మాయి పెళ్ళి ఎలా చెయ్యాలో అని ఎక్కువగా ఆలోచించేది. మా అమ్మాయి పెళ్ళికి తను వుండుంటే ఎంత బాగుండేది అనుకుంటూ, ఎప్పుడూ అవే ఆలోచనలు మళ్ళీ, మళ్ళీ వస్తున్నాయి.



మనుమరాలు దివ్యతో గోటేటి సత్యవతి

మా అమ్మాయి దివ్య అంటే ఇంటికి పెద్ద మనవరాలుగా అమ్మకి ఎంతో ఇష్టం. అమ్మ లేకపోవడం పెద్ద లోటే. ఇక్కడా నాకు సత్యసాయి బాబావారు చెప్పినది గుర్తుకువస్తోంది.

**సన్నజాజికన్నా, సంపంగిలకన్న**
**జున్నుగడ్డకన్న, వెన్నకన్న**
**నెమలి కన్ను కన్న, నిండు వెన్నెల కన్న**
**కన్నతల్లి ప్రేమ సున్నితంబు**

అందుకే భారతీయ సనాతన ధర్మాన్ని పునరుద్ధరించిన ఆదిశంకరులు తల్లికిచ్చిన మాటకోసం సన్యసించినా, తల్లియొక్క అంతిమ సమయంలో తల్లి చెంత ఆయన వున్నారు. అప్పుడు ఆయన వ్రాసిన మాతృ పంచకం అనే ఐదు శ్లోకాలను ఇదివరలో నేను ప్రముఖాంధ్రలో రాశాను. తల్లి మనకి దేహాన్ని ప్రసాదించిన దేహమాత మాత్రమేకాదు. తల్లి సాక్షాత్ జగన్మాత. కొంతమంది ఇంటిలో వున్న తల్లిదండ్రులను వదిలి పూజలు, వ్రతాలు, జపాలు, తపాలు, తీర్థయాత్రలు తిరుగుతూ వుంటారు. మన వేదం మనకు మాతృదేవోభవ, పితృదేవోభవ అనే బోధించింది. ముందు తల్లిదండ్రులను చూడండి. తరువాత దైవం తానంతట తాను అనుగ్రహిస్తాడు. తల్లిదండ్రులను ప్రేమించి, గౌరవించడం నిజమైన భక్తి. తల్లి ప్రేమకు నోచుకోకుండా మనం దైవప్రేమకు, అనుగ్రహానికి పాత్రులం కాలేము.

కొంతమంది తల్లిదండ్రుల కర్మ చెయ్యడానికి చాలా ఆలోచిస్తారు. అనవసరం అంటారు. అటువంటి వారికోసమే ఈ నాలుగు మాటలు. తన్ను తానే అర్పించుకున్నా తీరునా తల్లి ఋణం. గయా క్షేత్రంలో పిండ ప్రదానం చెయ్యడం గురించి అందరూ వినే వుంటారు. గయా క్షేత్రంలో "మాతృషోడశి" అని పదహారు మంత్రాలు వున్నాయి. అవి తల్లికి మనం పెట్టె పదహారు పిండాలకు సంబంధించినవి. ఆ మంత్రాలు నేను ఇక్కడ ఇవ్వటం లేదు. వాటి అర్థాలు మాత్రమే రాస్తున్నాను, గమనించ గలరు.

తల్లీ నువ్వు నన్ను గర్భాన్ని ధరించినప్పటి నుంచి నేను నీవల్ల పోషింపబడ్డవాడిని. నా తల్లివైన నిన్ను ఈ దర్భపై నువ్వులు, నీటితో నిన్ను ఆవాహనం చేస్తున్నాను అంటూ తరువాత వచ్చే 16 మంత్రాలలోను నువ్వులు, నీరు, అక్షతలు విదిలి ఒక్కొక్క పిండంగా పెడతారు. తల్లిని తలుచుకుంటూ ఈ కర్మ చెయ్యాలి.

1. నన్ను గర్భాన (కడుపులో) మోస్తూ ఎత్తులు ఎక్కేటప్పుడు, పల్లములో దిగేటప్పుడు ఎంతో నొప్పిని భరిస్తూ వేదనకు గురియై నాకు కలిగిన పాపానికి ప్రాయశ్చిత్తంగా (పరిహారంగా) ఈ పిండాన్ని యిస్తున్నాను.
2. ఒక్కొక్క నెల ప్రసవ సమయాన నా తల్లికి ఏర్పడ్డ బాధను కలిగించిన కారణాన కలిగిన పాపానికి పరిహారంగా ఈ పిండం ఇస్తున్నాను.
3. నా తల్లి కడుపులో వుండి నా చిన్న చిన్న పాదాలతో తన్ని నొప్పి కలిగించినందుకు పరిహారంగా ఈ పిండాన్ని యిస్తున్నాను.
4. నా తల్లి నిండు గర్భిణిగా వున్నప్పుడు నావల్ల కలిగిన బాధకు ఈ పిండాన్ని యిస్తున్నాను.
5. నా తల్లి నన్ను గర్భాన ధరించినప్పుడు ఆవిడకి కలిగించిన ఆయాసానికి, అలసటకు కలిగిన పాపానికి నివృత్తిగా ఈ పిండాన్ని యిస్తున్నాను.

6. నాకు వ్యాధులు సోకకుండా, ఆరోగ్యంగా బయటపడాలని నా తల్లి చేదుమందులు కషాయాలు తాగించానే, ఆ పాపానికి ప్రాయశ్చితంగా ఈ పిండాన్ని యిస్తున్నాను.
7. నేను పుట్టినప్పుడు మూడు రోజులు ఆహారం లేకుండా (పక్షిణి అంటారు) నాకోసం బాధపడిందే ఆ తల్లికి నేను కలిగించిన బాధకు, వేదనకు ప్రాయశ్చితంగా ఈ పిండాన్ని యిస్తున్నాను.
8. రాత్రులు నేను నా తల్లి దుస్తులను మల, మూత్రములతో అశుద్ధం చేసిన పాపానికి ఈ పిండాన్ని యిస్తున్నాను.
9. నా ఆకలి, దాహం తీరుస్తూ తనకి వున్నా, లేకపోయినా (దీని అర్థం డబ్బు మాత్రమే అని కాదు ఒక్కొక్కసారి మనం తింటూ వున్నప్పుడు ఏడుస్తాం. అప్పుడు అలాగే సగం తింటూ వుండగానే పరిగెట్టుకుని వచ్చి మన ఆకలిని తీరుస్తుంది. ఇంకొక అర్థం డబ్బుతో కూడినదే తనకు వున్నా లేకపోయినా మనకి పెడుతుంది) నన్ను పెంచిందే ఆ తల్లికి పిండాన్ని యిస్తున్నాను.
10. రేయనక, పగలనక నా తల్లి చనుబాలు తాగుతూ ఆవిడకి కలిగించిన నొప్పికి, బాధకు ప్రాయశ్చితంగా ఈ పిండాన్ని యిస్తున్నాను.
11. మాఘమాసం, శిశిర ఋతువులో, మండు వేసవిలో తన శరీరాన్ని, ఉష్ణంగా వున్న సమయంలో కూడా నన్ను చల్లగా కాపాడిన నా తల్లికి కలిగించిన బాధకు పిండాన్ని యిస్తున్నాను.
12. నా బిడ్డ ఆరోగ్యం బాగుండాలి అనుకుంటూ మనకోసం అహరహం పరితపిస్తూ బాధలుపడ్డ నా తల్లికి కలిగించిన బాధకు ఈ పిండాన్ని ఇస్తున్నాను.
13. నా తల్లి పై లోకానికి వెళ్ళేటప్పుడు ఏ ఆటంకాలు ఎదురవ్వకుండా ఈ పిండాన్ని ఇస్తున్నాను.
14. నా తల్లికి నేను యిచ్చిన బాధలకు పరిహారంగా, బుద్ధిమంతులైన పిల్లలు తల్లికి ఏవిధమైన సేవలు చేస్తారో, అలాగే అనుకొని ఈ పిండం యిస్తున్నాను.
15. నేను బాగా పెరిగి పెద్దవ్వాలని నాకోసం ఎన్నో త్యాగాలు చేసిన నా తల్లి ఈ పిండాన్ని ఇస్తున్నాను.
16. గర్భాన వున్నప్పుడు, శిశువుగా వున్నప్పుడు, నా తల్లికి నేను కల్పించిన మరణవేదనకు, ఇచ్చిన కష్టాలకు పరిహారంగా ఈ పిండాన్ని యిస్తున్నాను.



మనుమలు, మనుమరాళ్ళతో గోటేటి దంపతులు

అంటూ ఇలా ఎవరైతే గయకు వెళ్ళి తల్లికి శ్రద్ధతో, భక్తిపూర్వకంగా శ్రాద్ధాన్ని చేస్తాడో వాడికి ఎప్పుడూ వాడి తల్లి పరిపూర్ణ ఆశీర్వాదం వుంటుంది.

ఇన్ని రకాలుగా మనం తెలిసో, తెలియకో బాధపెట్టిన తల్లికి ఎన్ని జన్మలెత్తినా ఋణం తీర్చగలమా?

తమిళనాడులో పట్టినత్తార్ అనే సన్యాసి ఆయన తల్లి మరణించినప్పుడు అక్కడకు వెళ్ళి ఓ దేవుడా నన్ను గర్భంలో ధరించి నవమాసాలు మోస్తూ, నా తల్లి నాయొక్క బరువుకి పొట్ట జారినప్పుడు కూడా నాకు ఏమి బాధ కలుగుతుందోనని మెల్లగా నడుస్తూ, బాధలను భరిస్తూ మరణవేదనను అనుభవించి నన్ను కని, నన్ను చూసుకుని ఆనందంగా తన హృదయంపైన, ఒడిలోను, మంచంలోను, ఉయాలలోనూ నన్ను ఆడిస్తూ నా బోసినవ్వులు చూస్తూ, తన బాధను మరిచిపోయిన నా తల్లి చితికి ఈ చేతులలో ఎలా చితి పెట్టగలను అంటూ శోకించారు. బియ్యంతో రకరకాల పిండివంటలు చేసిపెట్టి నన్ను ముద్దాడుతూ, నా బంగారు కొండా, నా వరాల మూటా, నా చిట్టి తండ్రి అంటూ నోరారా నన్ను ముద్దాడిన నా తల్లి నోటిలో ఈ బియ్యాన్ని ఎలా వెయ్య మంటావు అంటూ శోకించాడు. నా కోసం తన్ను తాను బాధపెట్టుకుని, నా కోసం అన్నిటిని త్యాగం చేసి, తన జీవి తాన్నే కొవ్వొత్తిలా కరిగించిన నా తల్లికి ఈ చితిని (అగ్నిని) పెట్టి ఆవిడను ఎలా బూడిద చేయగలను అంటూ బాధతో శోకించాడు. అన్నీ తెలిసిన జ్ఞానులు, సన్యాసులు, ఋషులు, వైదికులే తల్లిని గురించి ఇలా బాధపడినప్పుడు నాంటి సామాన్యుడు ఎంతమాత్రం వారికన్నా నా బాధ ఎక్కువ. ఇది పత్రిక కోసం రాసినది కాదు. నాకు మా అమ్మ నిత్యం జ్ఞాపకం వస్తుంది. నేనొక్కడినే ఒంటరిగా తలుచుకుంటూ ఏడ్చిన సందర్భాలు ఎన్నో వున్నాయి. కర్మకాండలుపై నమ్మకం లేదంటారు. అటువంటి వారికి తల్లి పడే బాధలు గుర్తుచేద్దామనే నా తాపత్రయం. ఈ జీవిరావ్ పేజీ రాస్తున్నప్పుడు అమ్మను తలుచుకుంటూ నాకళ్ళలో నీళ్ళు అలా కారిపోతూనే వున్నాయి. చుట్టూ వున్న మా సిబ్బందికి ఏమి అర్థం కాలేదు. తల్లి ఋణం అనేది ఎన్ని జన్మలెత్తినా తీర్చలేనిది. తల్లే తొలి దైవం. తల్లిదండ్రులను మరచిన మూర్ఖుణ్ణి దేవుడు కూడా రక్షించలేడు. తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత చూపండి, వారు ఎంతో కష్టపడి మిమ్మల్ని పెంచారు. వాళ్ళని ఆనందపరచండి, సంతోషపెట్టండి, వారికి చెయ్యవలసిన సత్‌కర్మలు చెయ్యండి. అప్పుడు దేవుడు మీపట్ల ప్రేమను చూపుతాడు. ●

